# మహాతల్లి

నిజంగా మహాతల్లే! ఆవిడను చూస్తే ఎలాటివాళ్లకూ పూనకం వచ్చినట్టయేది. తాము ఏం చేస్తున్నదీ, ఏం మాట్లాడుతున్నదీ వాళ్లకు తెలిసేది కాదు. వెనకటి యుగాల "మదర్ గాడెసెస్" ఇంతకన్న గొప్ప "ఇమేజ్" కలవాళ్లు కారని రూఢిగా చెప్పవచ్చు.

అయితే ఇది వాస్తవికయుగం గనక, ఒకళ్లు దేవత అన్న మనిషిని మరొకళ్లు సైతాను అనటనం స్వాభావికం. మహాతల్లిని సైతాను అనలేదుగాని వెర్రిదని ఒక ప్రవాదు వేశారు. ఆవిడ కొందరు భక్తులను కరించిందనీ, దరిమిలా వాళ్లు చచ్చారనీ వదంతులు వ్యాపింపజేశారు.

ఈ వదంతులను చాలామంది మొదట్లో నమ్మలేదు. కాని ఆమె భక్తులను అప్పుడప్పుడూ కరవటం కొందరి కళ్లబడింది. ఆమెమీది భక్తికొద్దీ వాళ్లు ఆ సంగతి దాచిపెట్టారు. "ఆవిడ చేత కరిపించుకుని చస్తే, మరి జన్మ ఉండుద!" అనికూడా కొందరు వాదించారు.

ఆవిడకు ఈ కరిచే జబ్బు రాను రాను ముదిరిపోయింది. ఆవిడకు పిచ్చి అన్నది దాచేస్తే దాగని సత్యం అయిపోయింది. పోలీసులు వచ్చి ఆమెను అరెస్టు చేశారు. కొంతకాలం విశ్రాంతి ఇస్తామని ఆమెతో చెప్పటానికి చాలా పెద్ద పోలీసాఫీసరు వచ్చాడు.

"నాయనా, నన్ను వెర్రాసుపత్రిలో పెట్టటానికా వచ్చావు?" అని మహాతల్లి అడిగింది.

"ఛ, ఛ! ఎంతమాట!... కొద్దికాలం విశ్రాంతి!..." అని పోలీసు అధికారి గొణిగాడు.

"నాకు పిచ్చేమిటి, నాయనా? నాకు పిచ్చి అన్నవాళ్లకు పిచ్చి! కావలిస్తే నా కళ్లల్లోకి చూడు!"

మహాతల్లి పోలీసు ఆఫీసరును కండ ఊడేట్టు కొరికింది. మహాతల్లిని జైల్లో పెట్టారు. భక్తులు వేలసంఖ్యలో ఆమెను చూసి ఏడవటానికి వచ్చారు.

"నన్ను పిచ్చిదాన్నంటున్నారు. ఇంతకన్న అన్యాయం ఉందా?" అంటూ మహాతల్లి అందిన వాళ్లందరినీ కొరికింది.

"నిజంగా పిచ్చే అయి ఉంటుందంటావా?" అని భక్తులు ఒకరినొకరు అనుమానంగా అడుక్కున్నారు.

*ముద్రణ : యువ, ఆగస్ట్ 1977*